డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR

**విలేకరులు కావలెను..**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనాత్మకమైన వార్త కథనాలతో వెలువడుతున్న డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక కు విలేకరులు కావలెను.అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత... కొత్త వారికి అవకాశం..

సంప్రదించండి: 8121158069

| పెద్దపల్లి | గురువారం | 19 -02 -2026 | సంపుటి: 01 | సంచిక : 32 | పేజీలు : 08 | వెల :02/- |
|---|---|---|---|---|---|---|
| Peddapalli | Thursday | 19 -02-2026 | Volume: 01 | Issue: 32 | Pages: 08 | Cost :02/- |

## నాంపల్లి క్రిమినల్ కోర్టుకు బాంబు బెదిరింపు


- మధ్యాహ్నం పేలుడు అంటూ బెదిరింపు మెయిల్.
- తెలుగు రాష్ట్రాల పలు న్యాయస్థానాలకు అలర్ట్.
- తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు లేవు.



2

## ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్

- హైకోర్టు స్టే ఎత్తివేత.
- తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదేనని స్పష్టం.
- కౌన్సిలర్ యాదగిరిపై ఒత్తిడి వద్దని ఆదేశం.



## గ్రీన్ నెట్ జీరో సేవల హబ్‌గా
# హైదరాబాద్.
## - ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి.

- క్యూర్ ప్రాంతాన్ని కాలుష్యరహిత కేంద్రంగా రూపుదిద్దడం.
- తెలంగాణ రైజింగ్ దృష్టిలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం.
- గ్రీన్ ఎనర్జీ, మౌలిక సదుపాయాల సమన్వయంతో అభివృద్ధి.




**ముంబై, 18 ఫిబ్రవరి:**

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌ను గ్రీన్, నెట్ జీరో సేవల కేంద్రంగా అభివృద్ధి చేసి సుస్థిర పట్టణాభివృద్ధిలో హైదరాబాద్‌ను దేశానికి నమూనాగా నిలబెడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ముంబై క్లైమెట్ వీక్ సదస్సులో పాల్గొన్న ఆయన, వాతావరణ మార్పు నుంచి వాతావరణ అత్యవసర పరిస్థితికి ప్రపంచం చేరుకుందని పేర్కొంటూ తక్షణ చర్యలు అవసరమని పిలుపునిచ్చారు. తెలంగాణ రైజింగ్ దృష్టిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను రెండు వందల బిలియన్ **మిగతా 2 లో...**

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- పది రాష్ట్రాల్లో ముప్పై ఏడు స్థానాలకు ఎన్నికలు.
- మార్చి పదహారు పోలింగ్, అదే రోజు లెక్కింపు.
- ప్రత్యేక ఏర్పాట్లపై ఎన్నికల సంఘం దృష్టి.

2






2 లో

## ఏఐ సదస్సులో రోబో వివాదం.

- రాహుల్ గాంధీ ఆగ్రహం.
- చైనా రోబోను భారతీయ ఆవిష్కరణగా చూపించారన్న ఆరోపణ.
- గల్గోటియాస్ యూనివర్సిటీ స్టాల్‌పై చర్యలు.
- సదస్సును పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణించిన రాహుల్.

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:**

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో చైనాకు చెందిన రోబోలను భారతీయ ఆవిష్కరణలుగా ప్రదర్శించారన్న ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సును ఆయన పబ్లిసిటీ స్టంట్‌గా అభివర్ణిస్తూ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న సదస్సులో గల్గోటియాస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్ వివాదానికి కేంద్రబిందువైంది. యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఓ రోబోటిక్ కుక్కను ప్రదర్శించి దానికి ఓరియన్ అని పేరు పెట్టింది. అయితే టెక్ నిపుణులు అది చైనాకు చెందిన యూనిట్రీ గో టూ రోబో అని, లేబుల్ మార్చి భారతీయ ఆవిష్కరణగా చూపించారని ఆరోపించారు. వివాదం ముదరడంతో అధికార వర్గాలు తక్షణ చర్యలు తీసుకున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం గల్గోటియాస్

## మహిళ దుస్తులు లాగడం
## చెస్ట్‌పై తాకడం అత్యాచారమే

- సుప్రీంకోర్టు స్పష్టం.
- అలహాబాద్ హైకోర్టు తీర్పు కొట్టివేత.
- సుమోటోగా కేసు విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.
- మహిళల గౌరవానికి భంగం కలిగితే కఠిన చర్యల హెచ్చరిక.

2



## సాంస్కృతిక కేంద్రంగా
## హైదరాబాద్



2

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రహదారులు, సినిమాటోగ్రఫీ శాఖలపై ప్రీ-బడ్జెట్ సమీక్ష.
- లక్ష కోట్ల నిధులతో రహదారి ప్రాజెక్టులకు వేగం.
- రీజినల్ రింగ్ రోడ్డుకు రుణంపై గ్రీన్ సిగ్నల్.

## బాల్క సుమన్ అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- అక్రమ అరెస్ట్ అంటూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్.
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై కుట్ర ఆరోపణ.
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్.



# నాంపల్లి క్రిమినల్ కోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, 18 ఫిబ్రవరి:**

హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. మధ్యాహ్నం పన్నెండు గంటల ఐదు నిమిషాలకు బాంబు పేలుతుందంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ మెయిల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే బాంబు స్క్వాడ్ కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేపట్టింది. నాంపల్లి కోర్టుతో పాటు తెలుగు రాష్ట్రాలలోని పలు న్యాయస్థానాలకు కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. కరీంనగర్, రాజమండ్రి జైళ్లకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా కోర్టులలో ఉన్న సిబ్బందిని తాత్కాలికంగా బయటకు పంపించి భద్రతా తనిఖీలు నిర్వహించారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో కోర్టు ఆవరణలను పూర్తిగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎక్కడా అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని అధికారులు వెల్లడించారు. భద్రతా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇవి ఫేక్ బెదిరింపులై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసు నమోదు చేసి బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తులను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు సంబంధించిన అడ్డంకి తొలగింది. ఛైర్‌పర్సన్ ఎన్నికపై ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదేనని హైకోర్టు స్పష్టం చేసింది. పదహారవ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆకుల యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని జిల్లా కలెక్టర్, పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తన తండ్రి యాదగిరి అదృశ్యమయ్యారంటూ కుమారుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణ చేపట్టింది. ఆదేశాల మేరకు పోలీసులు యాదగిరిని హైకోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు విచారణలో యాదగిరి కీలక విషయాలు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే తనను బలవంతంగా చీరాలకు తీసుకెళ్లారని తెలిపారు. రెండు రోజుల పాటు రిసార్టులో ఉంచి, హైదరాబాద్‌లో పన్నెండు గంటల పాటు కారులో తిప్పారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. హైకోర్టు ఉత్తర్వులతోనే తాను కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని స్పష్టం చేసింది. పరిస్థితిని సమీక్షిస్తూ ఎన్నికల ప్రక్రియను చట్టబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించింది.

## ఏఐ సదస్సులో రోబో వివాదం.

మొదటిపేజీ తరువాయి...

యూనివర్సిటీని ఎక్స్‌పో నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వారి స్టాల్‌ను ఖాళీ చేయించినట్లు తెలిసింది. చైనా ఉత్పత్తిని స్వదేశీ ఆవిష్కరణగా చెప్పడంపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై స్పందించిన రాహుల్ గాంధీ భారతీయ ప్రతిభ, డేటాను వినియోగించుకోవాల్సింది పోయి చైనా ఉత్పత్తులను ప్రదర్శించడంపై ప్రశ్నించారు. భారతీయ డేటా అమ్మకానికి పెట్టి, విదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం సమంజసం కాదని అన్నారు. ఏఐ రంగంలో భారత్ ప్రతిష్ఠ దెబ్బతినేలా ప్రభుత్వం వ్యవహరించిందని ఆయన విమర్శించారు.

# గ్రీన్ నెట్ జీరో సేవల హబ్‌గా హైదరాబాద్.

మొదటిపేజీ తరువాయి...

డాలర్ల స్థాయి నుంచి రెండు వేల ముప్పై నాలుగుకు ఒక ట్రిలియన్ డాలర్లకు, రెండు వేల నలభై ఏడు నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యాన్ని వెల్లడించారు. నెట్ జీరో సాధన కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ పరిధిని క్యూర్‌గా ప్రకటించి, కాలుష్య కారక పరిశ్రమలు లేకుండా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు గ్రీన్ ఎనర్జీతో అనుసంధానం అవుతాయని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైలు, ఎక్స్‌ప్రెస్ మార్గాలు, డ్రై పోర్టులు, కొత్త విమానాశ్రయ సదుపాయాలు, భరత్ ఫ్యూచర్ సిటీ, మూసి రివర్ ఫ్రంట్, సరస్సుల పునరుద్ధరణ, వరద నియంత్రణ వంటి ప్రాజెక్టులు సుస్థిరతకు ప్రాధాన్యం ఇస్తాయని వివరించారు. రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ ముప్పై నాలుగు వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామని, ఇందులో దాదాపు పావు వంతు గ్రీన్ ఎనర్జీ నుంచే వస్తోందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, శక్తి, ఉపాధి, వ్యవస్థాపకత మధ్య సమతుల్యత సాధిస్తూ తెలంగాణను సుస్థిర అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:**

త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. పది రాష్ట్రాల్లోని మొత్తం ముప్పై ఏడు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. మార్చి పదహారు తేదీన పోలింగ్ జరగనుండగా, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొంది.మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బంగాల్, అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రాష్ట్రాల్లోని సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుండటంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతోంది. ఫిబ్రవరి ఇరవై ఆరు నోటిఫికేషన్ విడుదల, మార్చి ఐదు నామినేషన్ల చివరి తేదీ, మార్చి ఆరు పరిశీలన, మార్చి తొమ్మిది ఉపసంహరణ గడువు గా నిర్ణయించారు. బ్యాలెట్ పత్రంలో ప్రాధాన్యతలను గుర్తించేందుకు రిటర్నింగ్ అధికారి అందించే ప్రత్యేక ఊదా రంగు స్కెచ్ పెన్ మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఇతర పెన్లు వాడరాదని కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు ప్రత్యేక పరిశీలకులను నియమించనున్నట్లు తెలిపింది. ప్రతి దశలో నిఘా చర్యలు చేపట్టాలని సూచించింది. ఇదే సమయంలో తమిళనాడు, పశ్చిమ బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత రాష్ట్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లపై సమీక్షలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# సాంస్కృతిక కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖలపై ప్రీ-బడ్జెట్ సమీక్షా సమావేశాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో లక్ష కోట్లకు పైగా నిధులతో రహదారుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల ప్రయాణ సౌకర్యం మెరుగుపరచడం, పెట్టుబడులను ఆకర్షించడం, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హెచ్ఏఎం నమూనా ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్విజయవాడ కారిడార్, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు కీలక రహదారి ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి హడ్కో నుంచి రుణం పొందేందుకు ప్రీ-బడ్జెట్ సమావేశంలో ఆమోదం తెలుపుతూ సంతకం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి బలోపేతమైన రహదారి మౌలిక వసతులు అత్యంత కీలకమని అన్నారు. అలాగే హైదరాబాద్‌ను దేశంలో ప్రముఖ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సినిమాటోగ్రఫీ శాఖ సంవత్సరం పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, దృఢమైన అమలుతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# మహిళ దుస్తులు లాగడం చెస్ట్‌పై తాకడం అత్యాచారమే

**న్యూఢిల్లీ, 18 ఫిబ్రవరి:**



మహిళ ఒంటిపైనున్న దుస్తులను లాగడం, చెస్ట్‌పై తాకడం అత్యాచార నేర పరిధిలోకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు వ్యాఖ్యలు సున్నితంగా లేవని, మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆక్షేపించింది. రెండువేల ఇరవై ఒకటి నవంబరులో ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతంలో జరిగిన ఘటనకు సంబంధించి ఈ కేసు నమోదైంది. పదకొండేళ్ల బాలికను ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించారు. దుస్తులు లాగి, ఆమెను అనుచితంగా తాకినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలిక అరుపులు విని స్థానికులు చేరుకోవడంతో నిందితులు పరారయ్యారు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు మహిళ చెస్ట్‌పై తాకడం, దుస్తులు లాగడం మాత్రమే అత్యాచారంగా పరిగణించలేమంటూ కేసును కొట్టివేయడంతో దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తీర్పు సమాజానికి తప్పుడు సందేశం ఇస్తుందని పలువురు న్యాయవేత్తలు, మహిళా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించి విచారణ చేపట్టింది. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలు ఏవైనా కఠినంగా పరిగణించాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల వాదనలు వినిపించుకుని తుది తీర్పు వెలువరించింది. మహిళల హక్కులు, గౌరవాన్ని రక్షించడంలో న్యాయస్థానం కట్టుబడి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

# బాల్క సుమన్ అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు బంద్ పాటించినా ప్రభుత్వం స్పందించలేదని కేటీఆర్ అన్నారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పటికి కాంగ్రెస్ నేతలు చేసిన చర్యలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు.

# తెలంగాణ వార్తలు

## రంజాన్ మాస ప్రారంభ సందర్భంగా ముస్లింలకు
# కేసీఆర్ శుభాకాంక్షలు

- పవిత్ర ఉపవాస మాసానికి ఆధ్యాత్మిక శుభాకాంక్షలు.
- గంగా జమున తహజీబ్‌కు హైదరాబాద్ ప్రతీక అన్న కేసీఆర్.
- శాంతి, సామరస్యాలు మరింత పెరగాలని ఆకాంక్ష.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభ దినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం మతస్థులు అత్యంత పవిత్రంగా భావించే ఈ మాసం ఆధ్యాత్మికత, భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పవిత్ర ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు, దైవభక్తితో సాగే రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగా జమున తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. రంజాన్ మాసం ప్రజల మధ్య శాంతి, సామరస్యాలు, సౌభ్రాతృత్వ భావనలు మరింత బలపడేలా చేయాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందాలని, దేవుని కృప ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. రంజాన్ మాసం ఆత్మపరిశీలన, సేవా భావనకు దారితీసే పవిత్ర కాలమని పేర్కొంటూ, ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీసుల్లో నూతనోత్సాహం.. క్రీడల కోలాహలం

- ఘనంగా ప్రారంభమైన 4వ ద తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్.
- ముఖ్య అతిథిగా విచ్చేసిన డీజీపీ బి. శివధర్ రెడ్డి.
- క్రీడా జ్యోతి ప్రజ్వలనతో పోటీలకు శ్రీకారం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నాలుగవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్2026" సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సైబరాబాద్ పోలీస్




కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని క్రీడాకారులు, అధికారులు కలిసి ఆలపించడంతో మైదానం రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల నడుమ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జైళ్లు మరియు కరెక్షన్స్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్ మాన్, లా అండ్ ఆర్డర్ ఏడిజిపి మహేశ్ మురళీధర్ భగవత్, గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ ఏడిజిపి డాక్టర్ అనిల్ కుమార్, ఇంటెలిజెన్స్ ఏడిజిపి విజయ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, సమన్వయం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఈ క్రీడా వేడుకల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ క్రీడాకారులు పాల్గొంటున్న ఈ స్పోర్ట్స్ మీట్ మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది.

# రాజ్యసభ అభ్యర్థులపై అధిష్ఠానం తుది నిర్ణయం

- పార్టీ నిర్మాణంపై రేపు సమీక్ష ద సమావేశం.
- స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చామన్న పిసిసి చీఫ్.
- రాజ్యసభ టికెట్ అంశం అధిష్ఠానం పరిధిలోనేనని స్పష్టం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంటుందని తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. రేపు జరిగే సమావేశంలో పార్టీ నిర్మాణం, అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వార్డు సభ్యుల్లో అరవై ఏడు శాతం బీసీలకే కేటాయించామని, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లలో యాభై శాతం బీసీలకు అవకాశమిచ్చామని వివరించారు. రాజ్యసభ సీటు బీసీకి ఇస్తారా లేదా అన్నది పూర్తిగా అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. సీట్లు సర్వే నివేదికల ఆధారంగా కేటాయించామని, చైర్మన్ పదవులు సభ్యుల సంఖ్యను బట్టి నిర్ణయించామని వెల్లడించారు.



మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీ పనితీరుపై అధిష్ఠానం సంతృప్తిగా ఉందని తెలిపారు. పార్టీ బలోపేతం, సామాజిక సమీకరణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# బొల్లారం స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల

- అల్వాల్, బొల్లారం, కొంపల్లి ప్రజల చిరకాల కోరిక
- ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవ ఫలితం
- కేంద్ర రైల్వే శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్

**జనం వాయిస్, హైదరాబాద్ ఫిబ్రవరి 18:**

అల్వాల్, బొల్లారం, కొంపల్లి ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల డిమాండ్‌కు ఎట్టకేలకు నెరవేరు లభించింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవతో బొల్లారం రైల్వే స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదలకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఈ డిమాండ్‌ను వ్యక్తం చేస్తూ వచ్చారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలకు ఈ రైలు నిలుపుదల ఎంతో ఉపయుక్తమవుతుందని భావిస్తున్నారు. స్థానిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలలో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రైల్వే అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు సమాచారం. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలతో మల్కాజ్‌గిరి పరిధిలో రైల్వే కనెక్టివిటీ మరింత బలపడనుంది. ప్రాంత అభివృద్ధికి ఇది మరో ముందడుగుగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ

**జనం వాయిస్, హైదరాబాద్, 18 ఫిబ్రవరి 18:**

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జీవో సంఖ్య రెండు వందల యాభై రెండు ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచార మరియు పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక తెలిపారు. ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్ మరియు వేటరన్ జర్నలిస్టులు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ, కార్డుల జారీ ప్రక్రియ నిరంతర పద్ధతిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ వేళల్లో మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రత్యేక కమిషనర్ పేర్కొన్నారు. పారదర్శక విధానంతో అక్రిడిటేషన్ ప్రక్రియను అమలు చేస్తామని తెలిపారు.



# ప్రీ-బడ్జెట్ సమీక్షలో ఇరిగేషన్, సివిల్ సప్లైస్‌పై దృష్టి

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ మరియు సివిల్ సప్లైస్ శాఖలపై ప్రీ–బడ్జెట్ సమీక్ష సమావేశాన్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాధాన్య కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఆహార భద్రత కార్డు అమలు, ఉచిత సన్న బియ్యం పథకం అమలు విధానం, ప్రజలకు సమర్థవంతమైన సేవలందించే చర్యలపై సమావేశంలో సమగ్ర సమీక్ష చేపట్టారు. ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా అమలు కావాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా పురోగతిని వివరించి, రాబోయే బడ్జెట్‌లో కేటాయింపులపై చర్చించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి, పారదర్శకత, బాధ్యతాయుత పాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



# అర్హులైన ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇల్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్.
- లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష.
- ఎల్ వన్ కింద నాలుగు వేల ఎనిమిది వందల మందికి నిధులు.
- జీ ప్లస్ ఐదు నుంచి పది అంతస్తుల నిర్మాణాల ప్రణాళిక.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**

హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇండ్ల పురోగతిపై చర్చించారు. ప్రభుత్వం ఇళ్ల మంజూరులో పారదర్శకత పాటిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించి అందించడమే లక్ష్యమని తెలిపారు. ఎల్ వన్ కింద నాలుగు వేల ఎనిమిది వందల మందికి రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్ టు కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో భూముల సేకరణ చేసి జీ ప్లస్ ఐదు నుంచి పది అంతస్తుల వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు పడకల గదుల ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఖాళీలు, లబ్ధిదారుల సంఖ్యపై వివరాలు సమీక్షించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల అభివృద్ధి, స్థలాల సేకరణ, అసంపూర్తి డబుల్ బెడ్ రూం ఇళ్ల పూర్తి, పూర్తయిన ఇళ్ల కేటాయింపు అంశాలపై ఎమ్మెల్యేల అభిప్రాయాలు స్వీకరించారు. సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.



# జైలు జీవితం శిక్ష కాదు శిక్షణ: అంబటి రాంబాబు

- పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదల.
- జైలు అనుభవం తనలో పట్టుదల పెంచిందన్న మాజీ మంత్రి.
- కూటమి ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తానని హెచ్చరిక.



**జనం వాయిస్, రాజమండ్రి, 18 ఫిబ్రవరి 18:**

రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని శిక్షగా కాకుండా శిక్షణగా భావించానని తెలిపారు. బాత్రూంలో జారిపడిన సంఘటన మినహా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని పేర్కొన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. తనను జైలులో ఉంచితే భయపడతానని కొందరు భావించి ఉండవచ్చని, కానీ తాను ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. కాలం తిరిగి వస్తుందని, అన్యాయాలకు తగిన సమాధానం లభిస్తుందని వ్యాఖ్యానించారు. తన ఇంటిపై జరిగిన దాడి వెనుక ప్రభుత్వం ఉన్నదని ఆరోపించారు. దుండగులు గంటల తరబడి దాడి చేసినప్పటికీ పోలీసులు అక్కడే ఉన్నారని, తమ రక్షణలోనే దాడి జరిగిందని విమర్శించారు. దాడి చేసిన వారికి తక్షణమే బెయిల్ లభించిందని, తనకు మాత్రం పద్దెనిమిది రోజుల తర్వాత బెయిల్ రావడం అన్యాయమని అన్నారు. జైల్లో సాధారణ ఖైదీగానే ఉన్నానని, ప్రత్యేక సౌకర్యాలు కోరలేదని తెలిపారు. జైల్లో అందించిన భోజనమే తీసుకున్నానని, ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోనే కొనసాగుతుందని, వెనుకడుగు వేయనని పునరుద్ఘాటించారు. రాష్ట్ర పరిస్థితులపై పూర్తి సమాచారం సేకరించిన తర్వాత గుంటూరులో విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని వెల్లడించారు.

# ఆంధ్రప్రదేశ్

## డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం విఫలం

# వైఎస్ షర్మిల

- మదనపల్లి ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం
- బాధిత కుటుంబానికి పూర్తి సహాయం చేయాలన్న డిమాండ్
- గంజాయి, డ్రగ్స్‌పై కఠిన చర్యలు కోరిన వైఎస్ షర్మిల

**జనం వాయిస్, విజయవాడ, ఫిబ్రవరి 18:**

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. మదనపల్లిలో ఏడేళ్ల బాలికపై జరిగిన దారుణ హత్యాచార ఘటన రాష్ట్రంలో మాదకద్రవ్యాల ప్రబలతకు నిదర్శనమని పేర్కొన్నారు. గంజాయి మత్తులో జరిగిన ఈ పైశాచిక ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన షర్మిల, బాధిత బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయని ఆరోపిస్తూ, అవగాహన కార్యక్రమాలు కేవలం ఆర్భాటంగా మిగిలిపోతున్నాయని విమర్శించారు. నిరంతర నిఘా చర్యలు, కఠిన అమలు లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయని హెచ్చరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలో కఠిన చర్యలు తీసుకుని రాష్ట్రాన్ని భద్రంగా మార్చాలని పిలుపునిచ్చారు.



# లడ్డూ కల్తీపై వైసీపీ దారి మళ్లింపు రాజకీయాలు: మంత్రి అనిత

- సభలో చర్చకు సిద్ధమంటే కొత్త ఆరోపణల వల
- ఇందాపూర్‌హెరిటేజ్ పేర్లు లాగడం రాజకీయ కుతంత్రం
- ప్రజల విశ్వాసంపై రాజకీయాలు ఆడొద్దని హెచ్చరిక

**జనం వాయిస్, అమరావతి, 18 ఫిబ్రవరి 18:**

లడ్డూ కల్తీ అంశంపై ప్రభుత్వం సభలో సమగ్ర చర్చకు సిద్ధమని ప్రకటించగానే వైసీపీ నేతలు కావాలనే దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి అనిత తీవ్రంగా విమర్శించారు. అసలు విషయంపై చర్చించకుండా ఇందాపూర్, హెరిటేజ్ సంస్థల పేర్లు లాగుతూ అనవసర వివాదం సృష్టించడం వెనుక దురుద్దేశం ఉందని ఆమె ఆరోపించారు. లడ్డూ తయారీకి సంబంధించిన ఆరోపణలపై స్పష్టత ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైతే సంబంధిత అధికారులతో పాటు పూర్తి వివరాలు సభలో వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. అయితే వైసీపీ నేతలు తమ పాలనలో జరిగిన లోపాలు బయటపడతాయనే భయంతో కొత్త కొత్త కథనాలు అల్లుతున్నారని విమర్శించారు. ఇందాపూర్, హెరిటేజ్ సంస్థల మధ్య సంబంధాలు ఉన్నట్లు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. లడ్డూ వంటి పవిత్ర ప్రసాదం అంశాన్ని రాజకీయ లాభనష్టాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. భక్తుల విశ్వాసం దెబ్బతినేలా తప్పుడు ప్రచారాలు చేయడం సమంజసం కాదని హెచ్చరించారు. వాస్తవాలను ఎదుర్కోలేక వైసీపీ నేతలు మాయమాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి అనిత స్పష్టం చేశారు. ఎలాంటి ఆరోపణలైనా ఆధారాలతో రావాలని, చర్చకు





సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. లడ్డూ వ్యవహారంలో పారదర్శకత పాటిస్తామని, ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

# శనగ రైతులకు శుభవార్త కొనుగోళ్లు ప్రారంభం

- రబీ సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా సేకరణ.
- ధరల మద్దతు పథకం కింద తొంబై నాలుగు వేల ఐదు వందల మెట్రిక్ టన్నుల లక్ష్యం.
- రైతు సేవా కేంద్రాల్లోనే పారదర్శక కొనుగోళ్లు.

**జనం వాయిస్, అమరావతి, 18 ఫిబ్రవరి 18:**

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రెండువేల ఇరవై ఐదు ఇరవై ఆరు రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం తొంబై నాలుగు వేల ఐదు వందల మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా కొనుగోళ్లు నిర్వహించబడతాయని స్పష్టం చేశారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో ముఖ్యమంత్రి యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని వివరించారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరుగుతాయని చెప్పారు. పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు లక్షల ఇరవై ఐదు వేల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు మూడు లక్షల డెబ్బై ఏడు వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన పదిహేను రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.



# అన్నమయ్యలో సంచలనం

- బాలికపై దారుణానికి పాల్పడిన నిందితుడు చెరువులో మృతదేహం.
- పోలీసు కస్టడీ నుంచి తప్పించుకుని ఆత్మహత్య అనుమానం.
- నీటి డ్రమ్‌లో బాలిక మృతదేహం వెలికితీత.
- ఘటనపై ఆగ్రహావేశాలు, రాస్తారోకో.

**జనం వాయిస్, అన్నమయ్య జిల్లా, ఫిబ్రవరి 18:**

జిల్లాలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసు తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కులవర్ధన్ అనే వ్యక్తి పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని, అనంతరం కురబలకోట మండలం కనసానిపల్లి చెరువులో మృతదేహంగా లభ్యమయ్యాడు. జిల్లా ఎస్పీ కె. ధీరజ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మదనపల్లె పట్టణానికి చెందిన చేనేత కార్మికుడి రెండో తరగతి చదువుతున్న కుమార్తె సోమవారం అదృశ్యమైంది. ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయిన చిన్నారి కోసం తల్లిదండ్రులు గాలింపు చేపట్టి,



అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో బాలిక చివరిసారిగా పొరుగింటి వ్యక్తి కులవర్ధన్‌తో కనిపించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు అనుమానితుడి ఇంటిని పరిశీలించగా లోపల నీటి డ్రమ్‌లో బాలిక మృతదేహం లభ్యమైంది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో తప్పించుకున్నాడు. గాలింపు చర్యలు చేపట్టగా మరుసటి రోజు ఉదయం చెరువులో అతని మృతదేహం బయటపడింది. ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా భావిస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం నిందితుడు బాలికపై అత్యాచారం చేసి అనంతరం నీటి డ్రమ్‌లో ముంచి హత్య చేసినట్లు డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించారు. ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. నిందితుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నంద్యాలలో ఉపాధి హామీ చట్ట పరిరక్షణ యాత్ర

జనం వాయిస్, నంద్యాల, ఫిబ్రవరి 18:

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ గ్రామ జి చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పరిరక్షణ యాత్ర నేడు నంద్యాల జిల్లాలో కొనసాగింది. ఈ యాత్రలో వైఎస్ షర్మిల పాల్గొన్నారు. గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థులు తమ సమస్యలను వెల్లడించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గాంధీ గారి పేరుతో అమలవుతున్న ఉపాధి హామీ చట్టం వల్ల గతంలో సంవత్సరానికి వంద రోజులపాటు పని లభించేదని గుర్తుచేశారు. అప్పటి పాలనలో చేతినిండా ఉపాధి దొరికేదని ఒక రైతు వివరించారు. అయితే ప్రస్తుతం పని దొరికే రోజులు గణనీయంగా తగ్గిపోయాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన మరొకరు చేసిన పనికి వేతనాలు సకాలంలో అందడం లేదని తెలిపారు. ఉపాధి హామీపై ఆధారపడిన పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మళ్లీ వంద రోజుల పనికి హామీ ఉంటుందని కొందరు గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కొత్త చట్టం



ద్వారా నిధులను మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం పేదల జీవనాధారమని, దాన్ని కొనసాగించేందుకు పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# జమ్మికుంట లో బిఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ

- జమ్మికుంట ను అభివృద్ధిలో పథంలో నడిపిస్తాం.
- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్.
- వైస్ చైర్మన్ ముంతాజ్ ఆలీ మహమ్మద్,కౌన్సిలర్లు వెల్లడి.
- సంబరాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు.

**జనం వాయిస్,జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపాలిటీ పీఠం పై గులాబీ జెండా ఎగురవేయడంతో బిఆర్ఎస్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ ఆలీ మహమ్మద్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... జమ్మికుంట మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం పై ఆనందం వ్యక్తం చేస్తూ,హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో జమ్మికుంట పట్టణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై,తమ పై ఉంచిన నమ్మకానికి నిలబెట్టుకుని, జమ్మికుంటను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని,జమ్మికుంట పట్టణంలో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి వర్గానికీ



న్యాయం చేసే విధంగా పాలనఅందిస్తామనితెలిపారు.బీఆర్ఎస్ నాయకత్వం,మార్గదర్శకత్వంలో జమ్మికుంటలో అభివృద్ధికి బాటలు వేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత తలుచుకుంటే ఏదైనా చేయొచ్చు

## - దానికి నిదర్శనం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ (దిలీప్)







**జనం వాయిస్,జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికలలో 23వ వార్డు నుండి గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గెలుపు రాష్ట్ర రాజకీయాల్లోనే మలుపు తిప్పింది. రెండు ప్రధాన పార్టీలకు గట్టిగానే పోటీ ఇచ్చి గెలుపొందడం, ఇరుపార్టీల వారికి తానే దిక్కు అనేలా ఒక చరిత్ర సృష్టించాడు. యువత తలుచుకుంటే ఏదైనా చేయొచ్చు అనేలా దిలీప్ గెలుపు యువత కు ఆదర్శంగా చేసింది. తన ప్రచారంలో నేనే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని అని మొదటి నుండే చెప్పుకుంటూ వస్తూ చివరికి రెండు పార్టీలకు ముచ్చెమటలు పట్టించిన యువ నాయకుడు దిలీప్ కుమార్. ఫలితం ఏర్పడిన రెండు రోజుల వరకు జమ్మికుంట పట్టణంలో ప్రతి ఒక్క రికి ఒకే నమ్మకం ఏ పార్టీ నుండి అయినా సరే దిలీప్ కుమార్ నే మున్సిపల్ చైర్మన్ పీట మీద కూర్చుంటాడని పట్టణ ప్రజలు కొంతమంది నాయకులు సామాజిక కార్యకర్తలు రాజకీయ విశ్లేషకులు అనుకున్నారు. అన్నట్టుగానే చివరి క్షణంలో మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంతోమంది క్షతవిధాలుగా ప్రయత్నాలు చేసినా ఒంటి చేత్తో విజయం సాధించి మున్సిపల్ చైర్మన్ గా ఆయన అవడం డబ్బుకు లొంగకుండా ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వారికి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల్లో విజయం సాధించారు.

### జమ్మికుంట పట్టణాన్ని అద్దంలా తీర్చిదిద్దుతా....


జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నన్ను నమ్మి మున్సిపల్ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా అలాగే నా వెంట ఉండి నా గెలుపుకు కారకులైన 23వ వార్డు ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను అని, 23వ వార్డును అభివృద్ధి బాటలో తీసుకెళ్లి వారి రుణం తీసుకుంటాన ని జమ్మికుంట పట్టణాన్ని అద్దంలా మెరిపిస్తానని రాష్ట్రంలోనే జమ్మికుంట పట్టణం ఒక ప్రత్యేక గుర్తింపుగా తీసుకొస్తానని పదవి బాధ్యతలు చేపట్టిన నుండి చివరి వరకు ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ నిబద్ధతతో నిక్షపాతంగా పనిచేస్తానని ఆయన అన్నారు.

# సమాచార హక్కునీ లెక్కచేయని అధికార యంత్రాంగం

## - 80 రోజులు గడిచినా స్పందన లేదు -మట్ట పవన్ రెడ్డి

**జనం వాయిస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండలం పరిధిలోని కనగర్తి గ్రామంలో సమాచారం హక్కు చట్టం కింద దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తుకు 80 రోజులు గడిచినా స్పందన రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కనగర్తి గ్రామానికి చెందిన మట్ట పవన్ రెడ్డి గ్రామ పంచాయితీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల మంజూరు, ఖర్చుల వివరాలు, అభివృద్ధి పనుల అంచనాలు, టెండర్ ప్రక్రియ, బిల్లులు, వౌచర్లు, లబ్ధిదారుల జాబితా, పనుల అమలు స్థితి తదితర అంశాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం అధికారికంగా ఆర్‌టీఐ అప్లికేషన్‌ను గ్రామ పంచాయితీ కార్యదర్శికి సమర్పించారు.అప్లికేషన్ సమర్పించిన రోజునే రిసీవ్డ్ కాపీ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. చట్టం ప్రకారం 30 రోజుల్లోపు సమాచారం అందించాల్సి ఉన్నప్పటికీ, 80 రోజులు పూర్తయినా సంబంధిత కార్యాలయం నుంచి ఎటువంటి సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టపరమైన నిబంధనలు ఏమంటున్నాయి?సమాచార హక్కు చట్టం ప్రకారం 30 రోజుల్లోపు సమాచారం ఇవ్వాలి.సమాచారం ఇవ్వకపోతే కారణాలు తెలియజేయాలి. నిర్లక్ష్యం వహించిన అధికారిపై జరిమానా విధించే అధికారం సమాచారం కమిషన్‌కు ఉంది.అయితే ఇప్పటివరకు ఎలాంటి లిఖితపూర్వక సమాధానం లేకపోవడం గమనార్హమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజల డబ్బు ప్రజలకే సమాచారం ప్రభుత్వ నిధులు ప్రజల పన్నుల రూపంలో సమకూరుతాయని, వాటి వినియోగంపై ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందని మట్ట పవన్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి పనులపై పారదర్శకత లేకపోతే అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. గ్రామంలో జరిగిన రహదారి నిర్మాణం, కాలువల మరమ్మతులు, భవన నిర్మాణాలు, స్ట్రీట్ లైట్లు, శుద్ధి నీటి పథకాలు వంటి పనులపై ఖర్చుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తదుపరి చర్యలు సమాచారం తక్షణమే అందజేయాలని, లేనిపక్షంలో మొదటి అప్పీల్ దాఖలు చేసి పై అధికారులను ఆశ్రయిస్తామని, అవసరమైతే రాష్ట్ర సమాచారం కమిషన్‌ను సంప్రదిస్తామని





ఆయన తెలిపారు. చట్టపరమైన మార్గాలను అనుసరించి ప్రజలకు న్యాయం చేయించుకుంటామని స్పష్టం చేశారు.గ్రామ పంచాయితీ అధికారులు ఈ విషయంపై స్పందించి పారదర్శకంగా వ్యవహరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లను సన్మానించిన బిఆర్ఎస్వి నాయకులు

**జనం వాయిస్, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ లను ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్వి జమ్మికుంట నాయకులు. అనంతరం బిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్ మాట్లాడుతూ ... బిఆర్ఎస్ పార్టీ 10 ఏళ్లలో అద్భుతంగా అభివృద్ధి చేసిందని, జమ్మికుంట పట్టణ ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పార్టీకే పటం కట్టారని, ప్రజలు టిఆర్ఎస్ పార్టీ పైన పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని జమ్మికుంట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, వాటిల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వారికి న్యాయం జరిగేలా చేయాలని పట్టణంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, చైర్మన్ వైస్ చైర్మన్ లకు వివరించారు. చైర్మన్ ప్రశాంత్ కుమార్ విద్యార్థి నాయకుడి నుండి ఈరోజు ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందని యువత రాజకీయాల్లో రాణించాలని





మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఈ సందర్భంగా నరేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కురపాటి సాయి కృష్ణ చింతల కౌశిక్ బండ ప్రశాంత్ ఎండి రహిమాన్ అఖిల్ అనిల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని పట్టణంలో పర్యటన

**జనం వాయిస్, హుజురాబాద్:**

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రొంటాల సుహాసిని బుధవారం విద్యానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్ దంపతులను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపుకు సహకరించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సుహాసినిని తోట రాజేంద్రప్రసాద్, ఇతర కాంగ్రెస్ నాయకులు సాదరంగా ఆహ్వానించారు. పూల బొకేలు అందజేసి, శాలువాతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రేణికుంట్ల సందీప్ (యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్), చిట్యాల రేవంత్ (హుజురాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ సెక్రటరీ) కేసరి మధుకర్ రావు, దిల్ శ్రీనివాస్, పుల్ల అద్భుత రావు, ఎం నిఖిల్ ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.




# తెలంగాణ ఆర్ టి ఐ కమిషనర్ తో వడ్లకొండ మహేందర్ గౌడ్.

## - సమస్యలపై ఆర్టీఐ దరఖాస్తుల పరిస్థితిపై చర్చ.

**జనం వాయిస్, గోదావరిఖని:**

నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు, ఇది మన హక్కు సమాచార పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ వడ్లకొండ మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కమిషనర్లతో కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు పి. వి. శ్రీనివాస్ రావు, భోపాల్ , ప్రవీణ్, అయోధ్య రెడ్డి, సింగరేణి మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చిన సమయంలో, సుందిళ్ల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం సమీపంలో వారిని మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో కమిషనర్లకు “మన హక్కు” డైరీలు అందజేసి, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్ సమస్యలపై ఆర్టీఐ దరఖాస్తుల పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ అధికారులు ఆర్టీఐకి సరైన సమాధానాలు ఇవ్వకపోతే వారిపై కఠిన చర్యలు తప్పవని కమీషనర్ స్పష్టం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి కండె సాగర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, విజయ గాంధీ తదితరులు పాల్గొన్నారు..








# అందుకే యూటర్న్.. భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు క్రెడిట్ ఆయనదే..!

పొట్టి ప్రపంచకప్ పోటీల్లో నాటకీయ పరిణామాల తర్వాత భారత్, పాకిస్థాన్ జట్లు తలపడ్డాయి. ప్రారంభంలో బహిష్కరిస్తామని ప్రకటించిన పాకిస్థాన్ క్రికెట్ మండలి చివరికి నిర్ణయం మార్చుకోవడంతో ఫిబ్రవరి 15న కొలంబోలో జరిగిన ఈ పోరును కోట్లాది మంది అభిమానులు వీక్షించారు. ఈ మ్యాచ్ ద్వారా శ్రీలంక క్రికెట్ మండలి, అంతర్జాతీయ క్రికెట్ మండలికి భారీ ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. అయితే ఈ మ్యాచ్ జరగడానికి అసలు కారణం ఎవరో అనే విషయంలో చర్చలు సాగుతున్నాయి. చాలా మంది అంతర్జాతీయ క్రికెట్ మండలే ప్రధాన పాత్ర పోషించిందని భావించినప్పటికీ, పాకిస్థాన్ క్రికెట్ మండలి అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ మాత్రం భిన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత్‌పాక్ మ్యాచ్ జరగడానికి అంతర్జాతీయ క్రికెట్ మండలి కారణం కాదని, శ్రీలంక అధ్యక్షుడి చొరవ వల్లే పరిస్థితులు మారాయని వెల్లడించారు. మ్యాచ్ అనంతరం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకేతో ప్రత్యేకంగా భేటీ అయిన నఖ్వీ, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సరైన సమయంలో శ్రీలంక అధ్యక్షుడు జోక్యం చేసుకోవడంతోనే తమ ప్రభుత్వం నిర్ణయం మార్చుకుందని చెప్పారు. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా శ్రీలంక అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలియజేయాలని సూచించారని పేర్కొన్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించేందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, శ్రీలంక అధ్యక్షుడు నేరుగా పాకిస్థాన్ ప్రధానితో మాట్లాడిన తరువాత పరిస్థితులు మారాయని నఖ్వీ వివరించారు. వెంటనే తమకు ఆదాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో ఉత్కంఠకు తెరపడిందని చెప్పారు. మ్యాచ్ విషయానికి వస్తే, కొలంబో వేదికగా జరిగిన పోరులో భారత్ ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్ 77 పరుగులతో రాణించగా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ తమ బౌలింగ్‌తో పాకిస్థాన్‌ను కట్టడి చేశారు. లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ జట్టు ఆరంభం నుంచే ఒత్తిడికి లోనై చివరికి 61 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ విజయంతో భారత్ సూపర్ ఎనిమిది దశకు చేరుకుంది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో శ్రీలంక అధ్యక్షుడితో కలిసి వీక్షించిన నఖ్వీ, తమ జట్టు పరాజయం దిశగా సాగుతుండటంతో మధ్యలోనే ప్రాంగణాన్ని వీడినట్లు సమాచారం. రాజకీయ పరిణామాలు, క్రీడా ఆసక్తి కలగలిపిన ఈ మ్యాచ్ ఇప్పుడు ఆసియా క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భారత్‌కు షాక్? అంతర్జాతీయ క్రికెట్ పోటీలు ఆస్ట్రేలియాకు మారనున్నాయా!

భారత్‌పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం క్రమంగా క్రీడారంగంపై కూడా పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పెద్ద క్రికెట్ పోటీల ఆతిథ్యంపై మార్పులు చోటుచేసుకునే అవకాశాలపై క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను ఆకర్షించే ప్రతిష్ఠాత్మక పోటీల నిర్వహణకు సంబంధించి భద్రత, దేశాల మధ్య సంబంధాలు, ప్రయాణ సౌకర్యాలు వంటి అంశాలు కీలకంగా మారుతున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

లభిస్తున్న సమాచారం ప్రకారం, అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆధ్వర్యంలో జరగనున్న 2029 ఛాంపియన్స్ ట్రోఫీ, 2031 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల ఆతిథ్య హక్కులను భారత్‌కు బదులుగా ఆస్ట్రేలియా కు అప్పగించే అంశంపై ఆలోచనలు జరుగుతున్నాయని క్రీడా వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఇప్పటివరకు దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో స్పష్టత ఇంకా రాలేదు. పెద్ద స్థాయి అంతర్జాతీయ పోటీల నిర్వహణలో భద్రతా పరిస్థితులు అత్యంత కీలకంగా మారుతున్నాయి. జట్లు, అధికారులు, ప్రసార బృందాలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనేందున చిన్న అంశాలు కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సందర్భాల్లో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని, అందుకే ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చ జరుగుతుందని సమాచారం. మరోవైపు భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిసింది. భారత్‌లో ఉన్న ఆధునిక మైదానాలు, విస్తృత ప్రేక్షకాదరణ, ప్రసార ఆదాయం వంటి అంశాలు దృష్ట్యా ఆతిథ్య హక్కులు మార్పు చెందడం సులభం కాదని కొందరు భావిస్తున్నారు. అయితే తుది నిర్ణయం పూర్తిగా అంతర్జాతీయ మండలి చేతుల్లోనే ఉంటుందని క్రీడా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వార్త వెలుగులోకి వచ్చిన తర్వాత క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి, ఆందోళన రెండూ కనిపిస్తున్నాయి. స్వదేశంలో ప్రపంచ స్థాయి పోటీలను ప్రత్యక్షంగా వీక్షించాలని ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిరాశ కలిగించే అంశంగా మారింది. అధికారిక ప్రకటన వెలువడే వరకు స్పష్టత రాకపోయినా, రాబోయే రోజుల్లో ఈ అంశంపై మరింత చర్చ జరిగే అవకాశముందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## రంజీ ట్రోఫీలో చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్

దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీ టోర్నీలో జమ్మూకశ్మీర్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. సెమీఫైనల్లో బలమైన బెంగాల్ జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించి తొలిసారి ఫైనల్‌కు అర్హత సాధించింది. కల్యాణిలోని బెంగాల్ క్రికెట్ అకాడమీ మైదానం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ నాలుగో రోజే ముగియడం విశేషం. మ్యాచ్ మలుపు మూడో రోజు తిరిగింది. బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 99 పరుగులకే కట్టడి చేసిన జమ్మూకశ్మీర్ బౌలర్లు విజయంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా సీమ్ ఆల్‌రౌండర్ ఆకిబ్ నబీ అద్భుత ప్రదర్శనతో మొత్తం 9 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. అతనికి సునీల్ కుమార్ చక్కటి సహకారం అందించాడు. దీంతో కశ్మీర్ జట్టుకు 126 పరుగుల లక్ష్యం మాత్రమే మిగిలింది. లక్ష్య ఛేదనలో ఆరంభంలో వికెట్లు కోల్పోయినా, అబ్దుల్ సమద్ దూకుడుగా ఆడుతూ మ్యాచ్ దిశను మార్చేశాడు. అతనికి వంశజ్ శర్మ సమర్థవంతంగా తోడుగా నిలిచాడు. కీలక సమయంలో ధైర్యంగా బ్యాటింగ్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. చివరగా వంశజ్ శర్మ సిక్స్‌తో విజయాన్ని ఖరారు చేయడంతో కశ్మీర్ శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ చారిత్రాత్మక విజయంతో జమ్మూకశ్మీర్ జట్టు ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభమయ్యే ఫైనల్లో కర్ణాటకను ఎదుర్కొననుంది. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న ఈ జట్టుకు ఇది అతిపెద్ద విజయంగా నిలిచింది.



# టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జైత్రయాత్ర.. వరుసగా నాలుగో విజయం


టీ20 ప్రపంచకప్ 2026లో దక్షిణాఫ్రికా జట్టు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతోంది. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన సఫారీలు అజేయంగా నిలిచి సూపర్ 8 దశకు అర్హత సాధించారు. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో యూఏఈపై 6 వికెట్ల తేడాతో సునాయాసంగా గెలుపొందారు. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేస్తూ ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు మాత్రమే చేయగలిగింది. సఫారీ



బౌలర్లలో కార్బిన్ బాష్ అద్భుతంగా రాణించి 4 ఓవర్లలో కేవలం 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. అతనికి తోడుగా అన్రిచ్ నోర్కియా రెండు వికెట్లు, జార్జ్ లిండే ఒక వికెట్ సాధించారు. యూఏఈ తరఫున అలీషాన్ షరాఫు 45 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. 123 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ వేగవంతమైన ఆరంభం ఇచ్చాడు. 11 బంతుల్లోనే 28 పరుగులు చేసి జట్టుకు మంచి బలం చేకూర్చాడు. అనంతరం ర్యాన్ రికెల్టన్ (30), డెవాల్డ్ బ్రెవిస్ (36) ధాటిగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుని మరో ఘన విజయం నమోదు చేసింది. ఈ విజయంతో గ్రూప్ డిలో అగ్రస్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికా సూపర్ 8లోకి దూసుకెళ్లింది. వరుస విజయాలతో ఉన్న ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రత్యర్థి జట్లకు గట్టి హెచ్చరిక పంపినట్లయింది.

# కోహ్లీతో పాక్ బ్యాటర్ పోలికపై స్పందించిన దినేశ్ కార్తీక్

పాకిస్థాన్ స్టార్ బ్యాటర్‌ను భారత స్టార్ ఆటగాడితో పోల్చడంపై మాజీ భారత క్రికెటర్ దినేశ్ కార్తీక్ స్పందించారు. చాలా కాలంగా బాబర్ ఆజామ్ను విరాట్ కోహ్లీతో పోల్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జట్టును కష్టాల్లోనుంచి గెలిపించే నమ్మకం, ఒత్తిడిలో ఆడే తీరు గొప్ప ఆటగాడి లక్షణమని, ఆ విషయంలో ఇద్దరి మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో బాబర్ ఆజామ్ తక్కువ పరుగులతో అవుట్ కావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. షాట్ సెలక్షన్ విషయంలో అతడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని కార్తీక్ వ్యాఖ్యానించారు. ఒత్తిడి సమయంలో పరుగులు చేయడం, జట్టును ముందుకు నడిపించడం అత్యుత్తమ ఆటగాడి లక్షణమని ఆయన పేర్కొన్నారు. జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కోహ్లీ నిర్లక్ష్యపు షాట్లకు వెళ్లదని, పరిస్థితిని అర్థం చేసుకుని




ఆడతాడని కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా 2022 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై కోహ్లీ ఆడిన మ్యాచ్‌ను గుర్తు చేశారు. ఆ మ్యాచ్‌లో ఆయన కీలక ఇన్నింగ్స్‌తో భారత జట్టుకు విజయం అందించాడని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో యువ ఆటగాళ్లు వేగంగా ఎదుగుతున్నారని, తన దృష్టిలో అభిషేక్ శర్మ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లలో ఒకడని కార్తీక్ పేర్కొన్నారు. క్రికెట్‌లో పోలికలు కంటే ప్రదర్శన ముఖ్యమని, ప్రతి ఆటగాడిని అతని శైలిలోనే అంచనా వేయాలని ఆయన సూచించారు.

డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM
గురువారం, ఫిబ్రవరి 19, 2026




# హాలీవుడ్ వైపు అడుగులు..

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటి ప్రియమణి ఇప్పుడు అంతర్జాతీయ చిత్రరంగం వైపు అడుగులు వేస్తోంది. ఇండోఅమెరికన్ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఓ అంతర్జాతీయ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రకు ఎంపికైనట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా కీలక పాత్రలో నటించనున్నారు. దర్శకుడు హర్ష్ మహదేశ్వర్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనుండగా, అమెరికాకు చెందిన నిర్మాణ సంస్థతో పాటు ముంబైకి చెందిన నిర్మాణ సంస్థ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. భారతీయఅమెరికన్ సంస్కృతుల మధ్య పెరిగే భావోద్వేగ అనుభవాలను ప్రధానంగా తీసుకుని కథ రూపొందుతున్నట్లు సమాచారం. విదేశాల్లో నివసించే ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగ ప్రయాణం, సంబంధాల విలువ, సంస్కృతుల మధ్య ఉన్న తేడాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారని చిత్ర వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రం ద్వారా ప్రియమణి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టడం విశేషంగా మారింది. ఇప్పటికే పలు భాషల్లో నటిగా తన ప్రతిభను నిరూపించుకున్న ఆమె, ఈ కొత్త ప్రాజెక్ట్‌తో అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపు పొందే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నిర్మాతగా నిత్యా మీనన్ కొత్త ప్రయాణం

ప్రముఖ నటి, జాతీయ అవార్డు గ్రహీత నిత్యా మీనన్ తన సినీ ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. నటిగా విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆమె ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారం ఎత్తుతున్నారు. 'కేయూరి ప్రొడక్షన్స్' పేరుతో స్వంత నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక సందేశంలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలను నిత్యా వెల్లడించారు. కేవలం వాణిజ్య విజయాలకే పరిమితం కాకుండా, బలమైన కథా నేపథ్యం, భావోద్వేగ గాఢత, సమాజంపై ప్రభావం చూపగల అంశాలతో కూడిన చిత్రాలను నిర్మించాలని సంకల్పించుకున్నట్లు తెలిపారు. సినిమా అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాకుండా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధం కలిగించే శక్తివంతమైన మాధ్యమమని ఆమె అభిప్రాయపడ్డారు. గత ఏడాది వరుసగా విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నిత్యా మీనన్, ఇక నిర్మాతగా కూడా తన ముద్ర వేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ నిర్మాణ సంస్థ కింద ఎలాంటి చిత్రం ప్రకటించకపోయినా, ముందుగా ఉన్న నటనా బాధ్యతలను పూర్తి చేసిన తరువాత నిర్మాణ కార్యకలాపాలను వేగవంతం చేయనున్నారు. ప్రయోగాత్మక పాత్రలు, వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నిత్యా మీనన్, అదే ధోరణిని నిర్మాతగా కూడా కొనసాగిస్తారని సినీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఆమె ప్రారంభించిన ఈ నిర్మాణ సంస్థ భవిష్యత్తులో నాణ్యమైన కథా చిత్రాలకు వేదికగా మారే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# మహేశ్ బాబు నెక్స్ట్ మూవీ ఫిక్స్..

## సందీప్ వంగా దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్




దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న సూపర్ స్టార్ మహేశ్ బాబు తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. తాజాగా ఆయన నెక్స్ట్ మూవీ అత్యంత క్రేజీ కాంబినేషన్‌లో ఫిక్స్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మహేశ్ బాబు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో ఓ భారీ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ పతాకంపై ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని సమాచారం. 'వారణాసి' షూటింగ్ పూర్తయ్యిన వెంటనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. సందీప్ వంగా ఇప్పటికే మహేశ్ కోసం ఓ శక్తివంతమైన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. తన సినిమాల్లో హీరోలను విభిన్నంగా, గాఢమైన భావోద్వేగాలతో చూపించే సందీప్ శైలి, మహేశ్ బాబు క్లాస్‌మాస్ ఇమేజ్ కలయికపై అంచనాలు అమాంతం పెరిగాయి. మరోవైపు మహేశ్ బాబు, సునీల్ నారంగ్‌ల మధ్య ఉన్న వ్యాపార అనుబంధం కూడా ఈ ప్రాజెక్ట్ త్వరగా ఫైనల్ కావడానికి కారణమని ప్రచారం జరుగుతోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై అభిమానులు ఇప్పటికే ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'ది కేరళ స్టోరీ 2' ట్రైలర్‌పై దుమారం

2023లో విడుదలై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన ది కేరళ స్టోరీ చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదల కాగా, సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. మొదటి భాగం మాదిరిగానే ఈసారి కూడా కథలో వివాదాస్పద అంశాలను ప్రధానంగా చూపించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. దేశ భవిష్యత్తు, మత మార్పిడులు, సామాజిక ఉద్రిక్తతలకు సంబంధించిన అంశాలను కథలో భాగంగా చూపించడంతో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రైలర్‌లోని కొన్ని సంభాషణలు, తీవ్రంగా చిత్రీకరించిన దృశ్యాలు ప్రస్తుతం తీవ్ర చర్చకు కారణమయ్యాయి. దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ ఈసారి కథను ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితం చేయకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించినట్లు తెలుస్తోంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించారు. ట్రైలర్‌లో చూపించిన కొన్ని కఠిన దృశ్యాలపై ముఖ్యంగా కేరళకు చెందిన నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సన్నివేశాలు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చూపించారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు, సమాజంలోని సమస్యలను ధైర్యంగా ప్రస్తావించిందంటూ చిత్రాన్ని సమర్థించే వర్గం కూడా ఉంది. ఇలా విడుదలకు ముందే వివాదాల మధ్య నిలిచిన ఈ సినిమా, విడుదల అనంతరం మరింత చర్చకు దారితీసే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# 'స్పిరిట్' చిత్రం ఫోటోపై చర్చ.. ప్రభాస్ రూపం చుట్టూ ఆసక్తి




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఒకవైపు 'ఫౌజీ' చిత్రీకరణలో పాల్గొంటూనే, మరోవైపు 'స్పిరిట్', 'కల్కి 2' చిత్రాల కోసం సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్‌కు సంబంధించిన ఒక ఫోటో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. అద్దం ముందు నిలబడి సిగార్ వెలిగిస్తున్న శైలిలో కనిపిస్తున్న ఆ ఫోటోను అభిమానులు 'స్పిరిట్' చిత్రంలోని దృశ్యమని చెబుతూ పంచుకుంటున్నారు. అయితే ఆ ఫోటో నిజంగా చిత్రీకరణ సమయంలో తీసినదా లేక కృత్రిమ మేధస్సు సహాయంతో రూపొందించబడిందా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ రాకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నది సందీప్ రెడ్డి వంగా. కథానాయికగా త్రిప్తి దిమ్రి నటిస్తుండగా, ప్రముఖ నటులు వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారిగా కనిపించనున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఫోటో అసలుదా కాదా అన్నది పక్కనపెడితే ప్రభాస్ రూపం మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అధికారిక సమాచారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మరో ఇంటెన్స్ రోల్‌లో అనుపమ పరమేశ్వరన్

టాలీవుడ్ క్యూట్ సెన్సేషన్, పాన్ ఇండియా నటి అనుపమ పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేకమైన అప్‌డేట్ అందింది. ఆమె ప్రధాన పాత్రలో ఒక మానసిక ఉత్కంఠభరిత కథతో తెరకెక్కనున్న కొత్త చిత్రాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్, బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు ఆర్జే షాన్ దర్శకత్వం వహించనున్నారు. గతంలో అనుపమ, షాన్ కలయికలో వచ్చిన చిన్న చిత్రం డిజిటల్ వేదికపై మంచి స్పందన పొందడంతో, ఇప్పుడు అదే జోడీ పూర్తి స్థాయి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామ్యంతో ఈ చిత్రం ప్రతిష్ఠాత్మకంగా రూపొందనుంది. ఈ చిత్ర నిర్మాత ప్రేరణ అరోరా గతంలో హిందీ చిత్రరంగంలో విజయవంతమైన పలు చిత్రాలను నిర్మించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రస్తుతం రూపొందుతున్న ఈ మానసిక ఉత్కంఠభరిత కథలో అనుపమ ఇప్పటివరకు చేయని భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. కథలో భావోద్వేగాలు, ఉత్కంఠ, మానసిక సంఘర్షణలకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. మే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, టైటిల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇప్పటికే ప్రేమమ్, కార్తికేయ 2, రాక్షసుడు వంటి విజయాలతో దక్షిణాదిలో బిజీ హీరోయిన్‌గా మారిన అనుపమ, ఈ కొత్త చిత్రంతో తన నటనలో మరో కోణాన్ని చూపించబోతున్నట్లు అభిమానులు ఆశిస్తున్నారు. పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ఈ ప్రకటనతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, అనుపమ కొత్త పాత్రపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com